
క్రోధన ఉగాది హాస్య కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ

# కన్యానిరీక్షణ

## వివినమూర్తి



**ఆ ఊరు** తిమ్మాపురం.

"తిమ్మ గజపతులవారు వెలయించిన అనేక గ్రామాలలో అదొహటీ" అంటావు నువ్వు.

"నీ బొందేం గాదూ! ఊరినిండా చెట్లు! చెట్ల నిండా కోతులు! వాటిని చూ "ిన మనుమలకూ అవే బుద్ధులు రావటంతో 'కోతులూరూ' అన్నారు: అదేదో నామోషీగా తోచిన నీ లాంటి యిస్త్రీ పిండివంటల వాళ్ళు సోగ్గా 'తిమ్మాపురమూ ' అని మిడికారు" అంటూ జమాయించి చెపుతాడే ఆయనే గున్నారావు తాత!

ఏవిటలా చూస్తావూ? ఇంకా వెలగలేదా! ఎంత అజ్ఞానమయ్యా నీది!

వెళ్ళు: వెళ్ళి తిన్నగా యర్రారం జంక్షన్లో దిగు! ఎదరే ఉన్న ఏలేట్లో పడు! తిన్నగా తిమ్మాపురంలో తేల్తావు! ఊళ్ళో అడుగు పెట్టావు గదా!

"రావయ్యా రా! అమ్మా నాన్నా కులాసాయేనా? వాడెవడూ—ఆ చెవులో వెంట్రుకలవాడూ—నీ మేనమామ—వట్టి వెధవోయి వాడు! లొడితడంత ఉండి ఎన్ని ముదర వన్లు చే సే వాడనుకునేవూ! నీ పోలికలన్నీ వాడివే సుమా!"అంటూ వీథరుగు మీంచే పలకరిస్తూన్న ముసలాయనతో-

"క్షమించాలి! మీ రెవరో నాకు గుర్తు రావటం లేదూ—" నసుగుతావు!

"దాని కేమీ—యిహ నిప్పుడు గుర్తు చేసుకో! ఇంతకీ మీ పెద్దమ్మ బాగుందా? మహ మర్యాదా మనిషోయి— అడిగిన వాళ్ళకు కాదని ఎరుగదు—నీలో ఆ లక్షణాలేవీ కనపట్టం లేదయ్యా-"

'ఆరి! ఎవరీ ము "ిలాడూ? ఒంటిమీద చొక్కా లేదు! చిన్న గావంచా! చూ స్తే పిట్టంత మనిషి, ఊరంత గొంతు' అనుకుంటూ తడబడుతూనే పెంకెతనంగా-

"నే నెవరో తమరికి తెలీదండి, తాతగారూ! ముసలితనం చాత చూపు మందగించినట్టుంది."

"అలాగటోయ్, తాతా! చూడగానే పట్టేశావు! నేత్ర వైద్యం నేర్చా నంటా వన్నమాట" అంటూనే "సుబ్బాయ్! ఆ పెద్ద లోటా గ్లాసు లేదూ—నీళ్ళు పట్టుకురా!" అంటాడు గొంతు పెంచి.

"అబ్బబ్బే! నే నలా అనలేదండీ—తమ రెలా విన్నారో!"

"ఓహొహొహొ! శ్రవణ లోపాన్నీ పట్టేశారు-శ్రవణ వైద్యంలో కూడా ప్రవేశ మున్న దన్న మాట! బాగుంది, నాయనా—భేషుగ్గా ఉంది. నీ మొహం నాకు తెలీడానికీ, నిన్ను నేను పలకరించటానికీ ఏం మనవడా, ఏంటి సంబంధం? ముదర పన్లు చే సే మేనమామ పోలికలే ఇచ్చాడే కాని, ఆ పాండురంగడు మర్యాద లెరిగిన పెద్దమ్మ బుద్ధులు ఇవ్వనే లేదయ్యా నీకూ-"

దాంతో పిచ్చెత్తినట్టు అరుస్తావ్-

"మహాప్రభో! నే నీ ఊరు రావటం ఇదే! నాకు మేనమామలూ లేరు, పెద్దమ్మలూ లేరు."

"ఆ ముక్క చెప్పటానికి అంత అరుస్తున్నావ్! ఏంటయ్యా నీ వ్యవహారం" అంటూ వీథరుగు మీంచి ఉరుకుతాడు! సరిగ్గా నీ పొట్ట దగ్గరకు తేల్తాడు. ని న్నాపాదమస్తకమూ చూస్తాడు! చూస్తూనే-

"ఒరేయ్, తాతయ్యాలూ: ఓయ్, చిట్టింరాజులు

1948లో సఖుమళ్ళ తిమ్మాపురంలో పుట్టి, రాజమండ్రి, కాకినాడలలో చదివాను. ఉద్యోగరీత్యా నిన్నటివరకూ విశాఖ, ఇకపై బెంగుళూరు నివాసం.

లోగడ ఆంధ్రజ్యోతి, స్వాతి కథల పోటీలలో బహుమతులు వచ్చినా, పోటీకోసమంటూ ప్రత్యేకంచి రాయటమూ, అది బహుమతి పొందటమూ ఇదే ప్రథమం. నచ్చిన రచయిత లెందరో ఉన్నా, శ్రీ కాళీపట్నం రామారావుగారి సాహిత్యమూ సాంగత్యమూ నన్ను తీర్చిదిద్దాయి.

పోతే, ప్రభలో హాస్య కథల పోటీ ప్రకటన చూశాక నే నెప్పుడూ రాయలేదని స్ఫురించింది. హాస్యం మీద చేసిన ఆలోచనలలో...మనుషుల శారీరక, మానసిక అవకరాలను వాడుకోవటం ద్వారానూ, సంఘటనలలో అవకతవకలనుంచీ, వాక్చమత్కారంనుంచీ సాధారణంగా హాస్యం పుడుతుందనిపించింది. నవ్వు రావటానికీ—వివేచనకూ సంబంధం లేదు. హాస్యానికి అంతర్వాహినిగా కరుణా, శృంగారమూ ఉంటాయి. మేధోస్థాయి ననుసరించి రకరకాల మనుషులకు వేర్వేరు రకాల హాస్యం పడుతుంది అని తోచింది. వ్యక్తుల ఆరోగ్యానికీ, జాతి ఆరోగ్యానికీ హాస్యం కూడా తగు మోతాదులో అవసరమేమో! జీవితంలో ఏడ్చుకోవాల్సిన వాటికీ, కోప్పడాల్సిన వాటికీ నవ్వుకొంటూ సహించేయటం ఘోరం కావచ్చుగనీ, బొత్తిగా నవ్వుకోకపోవటం అంతకన్నా ఘోరమేమో అనిపించింది. ఫలితంగా ఈ కథ రాయటానికి ప్రయత్నించాను! ఇందులో చిత్రితమైన జీవితం నా వెనకటి తరానికి సంబంధించినది కావటంవల్ల, నాది శ్రుతజ్ఞానమే గనక ఇందులో స్థలకాల వివరాలలో దోషాలుంటే సహృదయంతో పాఠకులు మన్నించగలరని ఆశిస్తూ—



శ్రీ వివినమూర్తి

గారూ! సూరి పెద్దులుగారి పెద్దబ్బాయ్! ఓ సూరన్న కావూ" పొలికేకలు... పొలికేకలు!

నువ్వొక్క అడుగు వెనక్కేస్తావు!

"ఇదేంట్రా భగమంతుడా—అందర్నీ పిలుస్తాడూ..." గుండెలు దడదడ లాడుతుంటాయి.

చుట్టూ చూస్తావు. పధి మంది! పది రకాల నవ్వులు! గిరజాల జుత్తులు! డేరా క్రాపులు—కొప్పు సిగలు. మెలేసిన మీసాలు. నావరాళ్ళ ఛాతీలు! తిరిగిన కండలు!

నీ నోరెండి పోతుంది! పరుగెడదామంటే కాళ్ళాడవు!

"ఊళ్ళో కొచ్చాడూ—కొత్త మొహమూ —పలకరించా నంతే—అమ్మో... అమ్మో!" అంటూ తల అటూ ఇటూ ఊపుతూ ముక్కుమీద వేలేసుకుని కళ్ళు పెద్దవి చేసి ఊపిరి బరువుగా విడుస్తూ—

"పట్టుకోండ్రా వీణ్ణి—సన్మానిద్దాం."

అంతే. ఎక్కడలేని ఊపూ వస్తుంది. అందుకుంటావు పరుగు.

నాలు గంగలు వేయకుండానే వాళ్ళ చేతుల మధ్య ఉంటావు. తీసుకెళ్ళి చాపమీద కూర్చోబెడతారు! లోటా గ్లాసు నీళ్ళూ ఖాళీ చేస్తావు! సోల గ్లాసు కాఫీని తువ్వాల్తో చుట్టి తెచ్చి మరొకరు సిద్ధంగా ఉంటారు.

"ఓయ్, మనవడా! తాతగారి కాఫీకి పై వేడే ఉందనుకునేవు. నాలుక ఊడి పోగలదు" అంటూంటా డాయన.

"తాతగారూ! వీరి పేరడగటమేల? మొహం చూస్తే తెలీటంలా—హనుమంతరావనీ" అంటాడో గిరజాలాయన.

"ప్రభువులు! ఊహించే శ్రమ నీ కెందుకు. చిట్టింరాజులుగారూ! అడిగేస్తే చెప్పరా—ఏమయ్యా, బాటసారీ! కాఫీ తాగేశావు గదా ఇప్పుడు చెప్పూ—నీ పేరేదీ? ఊరేదీ? ఎవరింటికి వేంచేశావూ?"

కొన్ని దశాబ్దాల క్రితం అదో సరసం! ఆయనే గున్నారావు తాత!

ఆ రోజుల్లో తిమ్మాపురం ఓ లంకాద్వీపం! ఎటు చూసినా కాలువలు! పచ్చని పంట పొలాలు! కొబ్బరి చెట్లు— అరటి తోటలు! ఊళ్ళో కొచ్చిన మనుషుల్ని అలా పలకరిస్తుం దా ఊరు! కొత్తగా వచ్చిన కాఫీ—కొబ్బరి నీళ్ళు—మజ్జిగ కొత్త మొహాలకు అందిస్తూ పలకరించే ఆ ఊరి ఆదరణకు

ఆ రోజుల్లో గున్నారావు తాత ఓ ప్రతి రూపం!

ఆ రోజు మునిమాపు వేళ!

గున్నారావు తాత మనవడు సూర్యం అప్పుడే పొలం నుంచి వచ్చాడు! పొద్దుట్నించీ పని చేసి ఉన్నాడు. వేణ్ణీళ్ళ అండా వీధిలో పెట్టుకున్నాడు! గోచీ! స్నానం.

ఇద్దరు బాటసార్లు అటే వస్తున్నారు!

"మనమా! వద్దిక నాదు మాట వినుమా! మర్యాదగా పొడుమా" అంటూ భీకరంగా అరుస్తూన్న సూర్యం వాళ్ళని చూశాడు.

ఒంటినిండా, బట్టలనిండా బస్సు ప్రయాణంలో రేగిన ఎర్రదుమ్ము! పూర్తిగా కుంకం పూజ అందుకున్న వెంకటేశ్వర విగ్రహాల్లా ఉన్నారు!

"ఏ ఊరయ్యా, షావుకార్లూ, మీది?" అన్నాడు మరింత భీకరంగా.

"మాది విశాఖపట్నం జిల్లా! గుమ్మలూరనీ—గున్నారావుగారి ఇల్లేదో చెబుతావూ?"

వీధరుగును చూపించి "పూజలో ఉన్నారు! వస్తారు కూచోండి..." ధాటీగా అన్నాడు.

ఇద్దరూ కూర్చున్నారు. సూర్యం తంతు చూస్తున్నారు.

పని చేసిన ఒళ్ళు! వేడి వేడి నీళ్ళు! సూర్యానికి ఉషారు పెరిగి పోతోంది! మాంచి భారీ శరీరం! ఆరున్నర అడుగుల పొడవు! అందుకు తగ్గ లావు! మద్దిమానుల్లాంటి తొడలు! ఉషారు పెరుగుతున్న కొద్దీ గొంతూ పెరుగుతోంది! కపిలవాయి వారి రికార్డు అందుకుని చిందులు మొదలెట్టాడు. చూసి చూసి—

"కొంప దీసి పెళ్ళికొడుకు ఈ కుర్రాడే నంటవా, సుబ్బారావు పంతులూ?" ఒకాయన.

"ఎంత మాట! ఇంతవరకూ ఆగుతాడుటండీ ఈ మహానుభావుడు—ముగ్గురున్నా చాల రనుకుంటాను."

"గట్టుమీద నడిస్తే గట్టు విరిగి పోతుందోయ్—మడిలో వదిలేస్తే మరి దున్న నక్క ర్లేదోయ్—నూర్పుల్లో పెడితే..."

"చిత్తం, చిత్తం. ఈయన కార్యానికి మంచం మాత్రం ఉపయోగించి ఉండరనే తోస్తోందండి."

"ఆ ఇల్లాలుకూడా ఈయన మాదిరే ఉండి ఉండాలోయ్—కాపోతే రసభంగం తప్పదు సుమా—ఏమంటావు?"

వాళ్ళలా మాట్లాడుకుంటున్నారు! మధ్య మధ్య అపహారించి నవ్వుకుంటున్నారు.

స్నానం పూర్తి చేసిన సూర్యం అండాతో సహా లోపలకు వెళ్ళబోతూ ఆగి ఆశ్చర్యంగా—

"ఏయ్, షావుకార్లూ! మా తాతయ్య కావాలన్నారు! మీ వెనకాలే ఉంటే—మీలో మీరే మాట్లాడుకుంటున్నా రేంటి?"

మాట పూర్తవకుండానే సుబ్బారావు పంతులు అరుగు మీంచి కిందకి గెంతి-

"మామయ్యగారూ! వీరు వెంకటేశ్వర్లుగారనీ—లోగడ తమకూ—"

గున్నారావు తాత మధ్యలోనే అందుకున్నాడు.

"నాయనా, సూరన్న కావూ! వీరు నీకు పిల్లనీయటానికి వచ్చిన పెద్దమనుషులు! షావుకార్లు కాదు! కాస్తంత బట్టలు కట్టుకుని రా!"

## 2

ఊరినించి అప్పుడే వచ్చాడు గున్నారావు తాత కొడుకు మరిడీరాజు.

కొట్టు గదిలో కొవ్వలి నవల చదువుతున్నాడు సూర్యం! చెవులన్నీ తండ్రి మాటల మీదే ఉన్నాయి! ఆయన గున్నారావు లాగ కాదు! మితభాషి! నవ్వడు.

కాళ్ళు గడుగు నీళ్ళూ—మంచినీళ్ళూ అందించింది చిట్టెమ్మ! విడిచిన బట్టలు వంకీకి తగిలించింది! పొయ్యి మీద డేగిసా ఉంచి నీళ్ళు పోసింది! వచ్చి తలకి కొబ్బర్నూనె రాసి ఆ చేతులే కాళ్ళకీ రాసింది! కాళ్ళు నొక్కుతూ-

"ఇంతకీ ఏం చేసుకొచ్చారండీ" అంది మెల్లగా.

"ముహూర్తాలు పెట్టి పంపాలి. మీ మామగారితో చెప్పు" అన్నాడు నిదానంగా.

సూర్యం గుండె ఆగి తిరిగి కొట్టుకుంటున్నట్టయింది! చదువుతున్న నవలలో కొవ్వలి మరో విధవా, వివాహం జరిపిస్తున్నాడు! అదేదో అపశ్రుతిగా అనిపించింది కాబోలు, ఆ పుస్తకాన్ని విసిరి కొట్టాడు! అది మూలనున్న తాటాకు చాపకి తగిలి చప్పుడయింది.

ఈలోగా చిట్టెమ్మ "కుర్రాడు చూడకుండానే కుదుర్చుకొచ్చారా?" కాళ్ళు గబగబా నొక్కుతూ నిష్ఠురంగా అంది.

"ఏంటా చప్పుడూ?" కొట్టు గది వేపు చూస్తూ-

"పెద్దాడే! గదిలో ఉన్నాడు."

"సూర్యం!" గంభీరంగా పిలిచాడు మరిడీరాజు.

మరుక్షణంలో వచ్చి తండ్రి ముందున్నాడు.

"ఏరా, నాన్నా, నే చూశా నా పిల్లని—నాకు నచ్చింది. నువ్వు చూడాలా?"

"అక్కర్లేదండి—అక్కర్లేదండి—" కంగారుగా అన్నాడు.

చిట్టెమ్మ వేపు చిన్న నవ్వుతో గర్వంగా చూశాడు మరిడిరాజు.

## 3

వాల్చిన నులకమంచం నడిబొడ్డున బాసింపట్టు వేసుకుని కూర్చుని ఉన్నాడు గున్నారావు తాత! రెండో మనవడు యర్రంరాజుది ఆయన భార్య పేరు। వాడూ తాతతో బాటే మంచంమీద ఉన్నాడు.

సూర్యం మడిలోకి వెళ్ళి ఎంచి ఎంచి ఆరు చెరుకులు తెచ్చాడు. తొక్కలు తీసి ముక్కలు చేసి అందిస్తున్నాడు! తమ్ముడూ, తాతా తింటున్నారు.

"తాతయ్యా! నువ్వే చెప్పాలి బాబయ్యగారితో—" బతిమాల్తున్నాడు సూర్యం।

"నువ్వే చెప్పుకోలేకపోయావ్రా" అంటా డొకమారు.

"నే చెప్పించా నే అనుకో—మీ బాబు వింటాడా?" మరో మారు.

"సాక్షాత్తూ కాంద్రకోట నూకాలమ్మ వారే గదోయ్ నీ మామగారు—ఆ వెంకటేశ్వర్లూ! ఇహ ఆ పిల్లను వేరేగా చూడటం దేనికిలే..." ఇంకో మారు!

మధ్యలో యర్రంరాజు "తాతయ్యా! బొండాలు కావాలన్నావ్రా—"

వరుగెత్తుకు వెళ్ళి కొబ్బరి బొండాలు దించి తెచ్చాడు సూర్యం.

తాతా మనవలు ఖాళీ చేస్తున్నారు!

పాలేరు చంద్రిగాడు అంతా చూస్తూ బొకబొకా నవ్వుతున్నాడు! వాడి వేపు మధ్య మధ్యలో గుర్రుగా చూస్తున్నాడు సూర్యం!

"అన్నర్యోవ్! నే చెప్పిన పని చేస్తావా—తాతయ్య నీకు వదిన్ని చూపిస్తాడూ—"

గున్నారావు యర్రంరాజు వేపు గుంభనగా చూశాడు.

"నువ్వూ, మన బొల్లెద్దూ కల్సి—ఇదిగో ఈ మడంతా దున్నాలి."

"అలాగే—" ఉత్సాహంగా అన్నాడు సూర్యం.

టెంకె అదిరిపోయేలా తగిలించాడు గున్నారావు—"నోరు ముయ్యరా, రుయ్యంరాజా." వాడు ఊరివేపు ఏడుస్తూ పరుగెత్తాడు.

"ఎప్పుడో వుప్మరాలకి ఊరు కదిలాన్రా! జిల్లాలు దాటి వెళ్ళాలంటే నాకు తెలీదూ" అంటూ ఆలోచనగా ఆగి—

"ఒరేయ్, రూనన్నా! చిట్టింరాజుల్ని రాత్రికి కలవమనరా—"

సూర్యం ఉత్సాహంగా లేచి "అయితే, బాబయ్యగారూ?" అన్నాడు సందేహిస్తూ.

"ఆ గొడవ నీ కేలరా?" ఆ మాట పూర్తవకుండానే ముంజుకాయల కోసం సూర్యం పరుగెత్తబోయాడు.

"పరువుకు రానివాటి కోసం పరుగెత్తకురా—మనవడా—కాళ్ళు పడిపోగలవ్రా—"

## 4

చుక్క పొడిచింది! కోడి కూసింది!

తాతా, మనవడూ తయారయి పోయారు. పంచెను తాతే స్వయంగా కట్టాడు. చీలమండల దాకా రాలేదు! జుబ్బా!గుడ్డ బొత్తాల జబ్బల కోటు! కండువా!

తాత షరతులు చాలా ఉన్నాయి. ప్రయాణమంతా నడకే! ఎప్పుడు మాట వినకపోయినా తిరిగి వచ్చేస్తాడు—అన్నింటికీ సూర్యం తలూపాడు.

వీథరుగుమీదే మరిడిరాజు మంచం! అతనితో గున్నారావు మాట్లాడడు. ఎందుకో సూర్యానికి తెలీదు. వాళ్ళు ఏం చెప్పుకోవాలన్నా చిట్టెమ్మకే చెపుతారు. తాతయ్య ఈ ప్రయాణం సంగతి చెప్పలేదు. అందుకే తెల్లారకుండా ప్రయాణం గట్టాడు అనుకుంటున్నాడు సూర్యం. తండ్రి నిద్ర లేవకూడదని వెయ్యి దేవుళ్ళకు మొక్కాడు—ఏ దేవుడూ వినలేదు.

మరిడిరాజు 'ఏరల ఏరల' అంటూ మంచంమీద కూర్చుని కన్పించాడు.

సూర్యానికి పై ప్రాణాలు పైనే పోయాయి.

"బయలు దేరే వాళ్ళని ఎక్కడికీ అని అడగ్గూడదని మీ మామ్మకీ తెలుసు! పద పద" అన్నాడు గున్నారావు ముందుకు నడుస్తూ।

మరిడిరాజు నోరు విడలేదు! గబగబా తాతననుసరించాడు సూర్యం!

ఊరి పొలిమేరల్లో చిట్టింరాజులు వాళ్ళని కలిశాడు.

చిట్టింరాజులికి గున్నారావు తాతమీద మహా గురి! ఒకరు రాజు లయితే, మరొహరు రాజనియోగులు! ఊరు దాటని తాతా మనవలకు ఊర్లూర్లూ చూశానని చెప్పుకునే చిట్టింరాజులు తోడయాడు.

ధర్మవరం దాటేసరికి సూర్యుడు పొడిచాడు!

అదృష్టదీపుని కథ పూర్తి చేశాడు గున్నారావుతాత. సూర్యం విజయభాస్కరుని కథ అడుగుతుంటే చిట్టింరాజులు హైమవతి అంటున్నాడు.

తాత మనసు ఆ కథలమీద లేదు. పత్తిపాడు దాటిం దగ్గర్నుంచీ బొగ్గు బస్సుమీదే ఉంది. అదెలా ఉంటుందీ ఆయన ఊహకి అందటం లేదు. దాని గురించి చాలా విన్నాడు.

"చాలా వేగిరం పోతుందిటోయ్, చిట్టింరాజులుగారూ—"

"ఇంకానూ—చాలానూ—"

"గుర్రం కన్నానూ?"

"ఇంకా—ఇంకా." పెదాలు బిగించేస్తూ కళ్ళు పెద్దవి చేస్తూ—

"అంత జోరుగా వెళ్తే పడిపోమా?" అన్నాడు సూర్యం.

కంగారుగా చూశాడు గున్నారావు.


"పడిపోయినా పడిపోవచ్చు—" ఆలోచిస్తూ అన్నాడు చిట్టింరాజులు.

"ఏమయ్యా, చిట్టింరాజులుగారూ! ఇంతకీ ఎప్పుడయినా బొస్సు ఎక్కారూ?"

"చిదం..." అటూ ఇటూ తేల్చకుండా నవ్వేశాడు.

"నా బొందరాజుగారూ! బురదరాజువే గాని వరదరాజులివి కాదయ్యా నువ్వు?"

గున్నారావు మాటలు మాటల్లాగే ఉన్నాయి. వెనకనుంచి బొంయ్, బొంయ్ మన్న హారను! ఇంజను ధ్వని!



అంతే! గున్నారావుతాత ఓ గెంతులో రోడ్డు మీంచి వల్లంలోకి గెంతడమేంటీ, కాలు పట్టు దప్పడమేంటీ, జరజరా జరజరా జారడమేంటీ, పిచ్చి మొక్కల మధ్యకి చేరడమేంటీ, వాటి ముళ్ళు వాటి పని మొదలెట్టడమేంటీ-

పోతే సూర్యం! రెండు చెవులు మూ సేసుకుని పిక్క సత్తువతో పరు గందుకున్నాడు! చిట్టింరాజు లు అతన్ని అనుసరించినా, ఎదురొచ్చిన చెట్టును పట్టుకుని పైకి పోయి కొమ్మల మధ్యకు చేరుకున్నాడు.

బస్సు దూసుకు పోయింది.

అయిదు నిమిషాల తరవాత పొదల మధ్య నుంచి గున్నారావుతాత అరుపులు!

"ఒరేయ్, సూరన్నా! ఎక్కడ చచ్చావురా? ఇక్కడున్నా న్నేనూ!"

ఇంకా పరుగెత్తుతూనే ఉన్న సూర్యం గొంతు దూరం నుంచి వినిపించింది.

"వస్తున్నా, తాతయ్యా!"

సూర్యం వచ్చాక చిట్టింరాజులు చెట్టు దిగాడు. ముసలాయనను బయటకు లాగారు.

"ఎందుకండీ, తాతగారూ, అలా పరుగెత్తారూ?" మీసాలకి అంటిన ఆకులు దు ఖుపుకుంటూ అడిగాడు చిట్టింరాజులు చిన్న నవ్వుతో.

"నీ పెళ్ళి కాదు కానీ, నా చావుకి వచ్చింద్రా, సూరన్నా" అంటూన్న గున్నారావు తేరుకుని చిట్టింరాజులు వేపు చూడకుండానే-

"అబ్బే! అది పరుగుటోయ్! కాస్తంత కళ్ళు తిరిగాయి, కాళ్ళు పట్టుదప్పాయి. అంతే! అది సరే, నువ్వా చెట్టు ఎక్కడం దేనికోయ్?" పక్కనున్న ఆకుల పసరు పిండి చెక్కుకు పోయిన మోకాళ్ళకి అంటిస్తూ మంటని ఓర్చుకుంటూ అన్నాడు.

"మరేముందండీ, తాతగారూ! బొస్సుని పై నుంచి చూ స్తే ఎలా ఉంటుందీ అని అనుమానం వచ్చి వీరు చెట్టు ఎక్కారు—" మీసాలు చిటికెన వేలితో సవరిస్తూ—

"అలాగటోయ్—వల్లంలోకి వెళితే అడుగు భాగమంతా అగుపిస్తుందోయ్! ఈ మారు ఆ పని జెయ్—బహు భేషుగ్గా ఉంటుందీ—" కాళ్ళు జాడిస్తూ అన్నాడు.

సూర్యం బిక్క మొహం వే సి "నే నసలు ఆ బస్సుని పైనుంచీ చూడలేదు—అడుగునించీ చూడలేదు—పక్క నుంచీ చూడలేదు."

కత్తిపూడి సత్రవలో మధ్యాహ్నం వంటలు చేసు కొని తిని విశ్రమించి చల్ల పొద్దన బయల్దేరి దీపాలు పెట్టే వేళకు తుని చేరుకున్నారు.

## 5

భుక్తాయాసంతో తుని సత్రవలో విశ్రమించాడు గున్నారావు! సూర్యం కాళ్ళు పడుతున్నాడు. ముసలాయన తేటగుంట దగ్గర ఇచ్చిన లెక్కను విడదీయటానికి చిట్టింరాజులు మీసాలు దువ్వుతున్నాడు. వేళ్ళు మడుస్తున్నాడు. జుట్టులో చేతులు పెట్టుకుంటున్నాడు—దొర్లుతున్నాడు.

"సరానరి పెళ్ళి వారింటికే వెళ్తామా తాతయ్యా మళ్ళీ మొదలెట్టాడు సూర్యం.

"నీ బొంద!"

"ఆ అమ్మిని చూపిస్తావా, తాతయ్యా?"

"నీ బొంద!"

"చూపించమని అడగటాన్కి నాకు సిగ్గేస్తాంది, తాతయ్యా!"

"నీ బొంద!"

"పోనీ, నువ్వే అడుగు, తాతయ్యా!"

"నీ బొంద!"

"నీ బొంద—నీ బొంద—అన్నింటికీ నీ బొందే! ఇదేం బావుంది, రాజుగారూ—నువ్వయినా చెప్పండి."

చిట్టింరాజులు ఈ లోకంలో లేడు! గుడిలోకి వెళ్ళి వచ్చినప్పుడల్లా పువ్వులు ఎలా, ఎందుకు రెట్టిం పవుతున్నాయా—ఆలోచన తెగటం లేదు.

"అదీ! అలా రాయరా పిక్కల మీద. ఒరే, రూనన్నా—నీకు జూ స్తే కాళ్ళు పట్టడమన్నా రాదూ—లాభం లేదురా—నీ పెళ్ళాం తురక సాయిబుతో లేచి పోతుందిరా."

"చిఛీ! తురకసాయిబుతోనా!" అంటూ గబగబా నొక్కి హఠాత్తుగా ఆపి "అవునూ, ఆ అమ్మికే కదా కాళ్ళు పట్టడం రావాలీ?"

గున్నారావు చిట్టింరాజులు వేపు తిరగకుండానే-

"మామనవడి అనుమానం మీద నీ అనుభవం ఏమంటుంది, రాజుగారూ?"

లెక్కలోంచి తలెత్తి "అంతేలెండి! అంతే—అంతే" అనేశాడు.

గున్నారావు తాత హఠాత్తుగా నవ్వి, అంత హఠాత్తుగానూ మానే సి-

"చిట్టింరాజులుగారూ!"

"చిదం!"

"నువ్వో కాస్తంత అబద్ధం ఆడాలండి, రాజుగారూ!"

"అబద్ధమా? ఆడటమా? మాది రాచపుటక, తాతగారూ."

"పోనీ, రాజుగారూ! నిజం చెప్పకుండా ఉండటానికి కుదురుతుందీ?"

"అలా అన్నారూ! అదేదో ధర్మ సమ్మతంగానే ఉన్నట్టుంది. ఇంతకీ మీ తాత్పర్యం అర్థం కావటం లేదు, తాతగారూ-"

"అంత సులువుగా అర్థమయితే ఇహ లేనిదేవీ? మనం ముగ్గురం నీ పెళ్ళి చూపుల నిమిత్తం బయల్దేరాం!"

"వీరికి మరొహ పెళ్ళా? రోజులు అనుకూలంగా లేవండి, తాతగారూ..." గర్వంగా మొదలెట్టి విచారంగా ముగించాడు.

"ఎంత మాట! తమరి అర్హతలకేం కాని, మా మనవరాలు ఏకంగా దేవిడీమన్నా చే సేస్తుంది! నువ్వా గుమ్మలూరులోనే పెళ్ళికొడుకువీ."


"ఘలో ద్వితీయం ఉంది గానీ పెళ్ళిచూపులు పద్ధతి గాదండీ."

"దాని కేముందీ? నువ్వా ఆధునికుడివీ—చదువుతున్నావూ."

"అదేటండీ? పెళ్ళి నా కయితే పెళ్ళిచూపులు రాజుగారా? నే కాళ్ళు పట్టను!" విసురుగా కాళ్ళు తో సేశాడు తేరుకున్న సూర్యం.

"మనవడా! రూనన్నా—నిన్నూ ఎద్దు మరాజా అని ఊరకే అన్నాన్రా నేనూ—చిట్టింరాజులు ఉత్తుత్తి పెళ్ళి కొడుకేరా—మన మా ఊరిమీంచి పోవడానికి ఓ కారణం ఉండాలి. మనసీ వారు పిల్లని చూడమనటానికి ఓ సూచన ఉండాలి."

సూర్యం కోపం తెగి ఆలోచన కుదిరేసరికి



గున్నారావుతాత గుర్రులో ఉన్నాడు! చిట్టింరాజులు మీనం మీద చెయ్యేసుకుని నిద్ర పోతున్నాడు.

## 6

అడ్డరోడ్డు జంక్షన్లో ఓ రాజుగారు పలకరించారు.

"ఏమిటీ? మావేంకటేశ్వర్లు పంతులుగారి వియ్యాలవారా? మాగుమ్మలూరులో విడిది చేయకుండా కదలనిస్తామూ ?" అంటూ ఓ మనిషిని ఊళ్ళోకి కబు రంపాడు.

"నఖుమళ్ళవారి అబ్బాయా? మహా పెూమైన కుదురండీ వారిది" అంటూ చిట్టింరాజులుని చూసి ముచ్చట పడ్డాడు.

"ఎప్పే! ఎప్పే చదివారండి! ఆధునికులు! గొప్ప సంస్కారులు! పిల్లను చూసుకుందామనీ మమ్మల్ని వెంట బెట్టుకు బయల్దేరారండి-"

"పుటకను బట్టే గాదండీ బుద్ధులూ—" పరీక్షగా చూస్తున్నాడు సన్యాసి రాజు.

"బాగా పోల్చారు."

"ఎవరి అమ్మాయినండీ చూసుకునేదీ?"

"చునాబరీ వారనీ—విశాఖపట్నం."

"చునాబరీ వారా? క్షత్రియులలో అలాంటి పేరు విన్నట్టే లేదండీ, పంతులుగారూ! అందులోనూ పిల్లని చూపిస్తున్నారూ అంటే?"

"అయితే, అలాంటి వారు లేనేలేరని సెలవిస్తారా తమరూ?"

సన్యాసిరాజు కంగారుగా అన్నాడు—

"అన్నన్నా! వారు సుక్షత్రియులూ! అన్నీ విచారించే వెళ్తున్నారా అనేదే సంశయం?"

చిట్టింరాజులు కంగారుగా గున్నారావు వైపు చూశాడు.

"లోకమంతా తమ కెరికే సంటే, రాజుగారూ—పొరుగూరి మనుషులం ఏం చెప్పగలం?"

"ఎంత మాటన్నారు, పంతులుగారూ! తమరలా భావించటం తగదుగాక తగదు! అబ్బాయిజూ స్తే చక్కటి వాడూ."

చిట్టింరాజులు మీసం దువ్వేడు-

"చదివినవాడు! సర్వమూ ఎరిగినవాడూ! పెళ్ళిచూపులు లేకపోవడమన్నది మాలో మధ్యలో వచ్చినదే—మధ్యలో పోవలసిందే అన్న ధర్మ సూక్ష్మం ఎరిగినవాడు! బహు యోగ్యుడు! లోకమంతా కరువూ అన్నట్టు అంత ప్రశస్తి లేని చోటికి పోవాలా? తెలీని చోట బురదా ఉంటుంది. అడుసు తొక్కటమేలా? అని తోటి రాజులం గదండీ—అందుకే విచారిస్తున్నాం."

గున్నారావు గుంభనగా నవ్వి-

"మేం కూడా అమాత్యులం! వారికీ మకూ దగ్గర వరసలు! మా సలహా లేనిదే వారు ఓ అడుగు వేయరు. తమరికి వేరే చెప్పాలా?"

చిట్టింరాజులు అయోమయంగా నవ్వాడు! సూర్యం అందర్నీ చూస్తున్నాడు!

"అదుగో- పంతులుగారు వస్తున్నారు."

ఉరకలు పరుగులు మీద వచ్చాడు వెంకటేశ్వర్లు—"ఎంత సుదినం! ఎంత సుదినం "అంటూ రెండు చేతులూ పుచ్చుకున్నాడు.

కొంత బతిమాలించుకున్నాక ఆ పూటకు వారింట్లో విడిది చేయడానికి ఒప్పుకున్నాడు గున్నారావు.

అంతా బయల్దేరుతుండగా సన్యాసిరాజు వెంకటేశ్వర్లుని పక్కకు పిలిచాడు.

"చూడబోతే నీ పెళ్ళిచూపులు నిజంగానే ఏర్పాటయ్యేట్టుంది, రాజుగారూ!" గొంతు తగ్గించి అన్నాడు గున్నారావు.

"ఏమిటో భయంగా ఉంది, తాతగారూ!"

"రాచపుట్టుక నీది! భయపడాల్సింది పప్పు తినేవాళ్ళం—మేమయ్యా! కొంప దీసి చూపిస్తానంటే చూస్తానని తొందర పడేవు సుమా!"

"తమరు ఘటనా ఘటన సమర్థులు—ఎక్కడికెక్కడికో ముడెట్ట గలరు."

అంతా ఊళ్ళోకి కదిలారు! సూర్యానికి ఏను గెక్కినట్టే ఉంది!

వేడి వేడి నీళ్ళు పెట్టించారు! ఇద్దరు మంగళ్ళు వచ్చారు. తలకీ, ఒంటికీ సోలెడు నూనె ఇంకించారు. కాళ్ళ శేర్లు తీశారు! శుభ్రంగా నలుగు పెట్టారు! తలంటారు. చలవ పంచలు కట్ట బెట్టారు!

పొగలు గక్కుతున్న అన్నం! రుచికరమైన వంటలు! బెల్లం జిలేబీ!

వీధి గదిలో విశ్రాంతికి ఏర్పాట్లు జరిగాయి! మంగళ్ళు విసురుతున్నారు! సూర్యానికి మహారాజ భోగంగా ఉంది! అంతా అగ్గగ్గలాడుతున్నారు! ఇటు చూస్తే ఏం కావాలి, అల్లుడుగారూ, అనొకరూ—అటు చూస్తే ఏం కావాలి, బావగారూ అని మరొకరూ-

అత్తలు! మామలు! బావమరుదులు! వస్తున్నారు! పలకరిస్తున్నారు! ఇతర కులాల ఆడంగులు పెళ్ళికొడుకు, పెళ్ళికొడుకు అంటూ చోద్యం చూస్తున్నారు. కానీ పెళ్ళి కూతురి దర్శనమే లేదు.

"కాస్తంత కునుకు దీస్తారా, మామగారూ-"

"నిద్రపోకపోతే జోలకూడా పాడే సేటట్లుంది—అల్లుడిగారి మర్యాదా—ఇంతకీ మామనవడికి నేలమీదే పక్క వేస్తే మంచానికీ వాడికీ క్షేమంగా ఉంటుం దనుకుంటాను." మంచాన్ని పరీక్ష చేస్తూ అన్నాడు గున్నారావు.

"తమరికి ఏ విషయంలోనూ పరాకు లేదండీ, మామగారూ ..." ఇబ్బందిగా నవ్వాడు వెంకటేశ్వర్లు.

"పరాకు చిత్తగిస్తే వెంకటేశ్వర్లు పంతులుగారితో నిగ్రహించుకు రాగలమామరి!" మళ్ళీ మాటవిసిరాడు. నవ్వుతూ కదిలాడు వెంకటేశ్వర్లు.

ఆయన తలుపు జేరేసి బయటకు వెళ్ళేసరికి సూర్యం తాతయ్యమీద పడిపోయాడు.

"ఆ ముక్కేదో వాళ్ళనాలి కాని, మనం అంటే బాగోదురా, సూరన్నా!"

నిజమే! పిల్లను చూడమనో, చూసుకుంటారా అనో వాళ్ళే అనాలి! ఆ మర్యాద తీరా వాళ్ళు పాటించకపోతే? సూర్యానికి ఉడుకుమోత్తనం వచ్చేస్తోంది. ఇంత దూరం ఈ ముసలాడి చాదస్తం కోసం ఇంత కష్టపడి నడిచి వస్తే ఇప్పుడిలా అంటా డేంటీ? అంత తెలివయిన వాడు—అందర్నీ అలా అల్లరి పెట్టేవాడు ఏదోలా కార్యం సానుకూల పరచాలే గానీ-

సూర్యం కంయ్ మన్నాడు.

"అరవకురా! వాళ్ళు వింటే బాగోదూ—" ముసలాయన బతిమాలాడు!

## 7

నాలుగ్గంటలకి లేచారు ముగ్గురూ! కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు వెంకటేశ్వరు—కాఫీ ఫలహారాలు వచ్చాయి! వెంకటేశ్వర్లు



నెమ్మదిగా మొదలెట్టాడు—

"మహుగారూ! మా సన్యా °సిరాజుగారు లౌక్యులుగారు! ముక్కుసూటి మనిషి! రాజ్యాలు కరువయినా అన్న పానాదులకి లోటు లేదు. మర్యాదలలో వారితో ఎవ్వరూ దీటు కాదు! బహు సంతానీ. పెద్దలను కలుసుకోకుండా అబ్బాయితో వ్యవహరించటం సంప్రదాయం కాదని వారూ ఎరుగుదురూ."

సన్యా °సిరాజు గారింట్లో అమ్మాయిని చూసుకోమని చిట్టింరాజులికి నచ్చ చెప్ప వల °సిందని వెంకటేశ్వర్లు సారాంశం!

"ఏమంటారు, రాజుగారూ!" బాగో దన్నట్టు అడిగాడు గున్నారావు.

చిట్టింరాజులు చిటికెన వేలితో మీసం లేపుతూ-

"మా మంచీ చెడ్డా తమరి కన్నా ఎవరికి ఎక్కువ తెలుస్తుంది, తాతగారూ?"

సూర్యానికి మహా బాధగా, అంతా కుట్రలా ఉంది. చూస్తూంటే ఈ రాజుగారు ఇక్కడి కిక్కడే మరో పెళ్ళికూడా చే సేసుకునేలా ఉన్నాడు. ఈ ముసలాయన చే సే సేలా ఉన్నాడు! తన నోట మన్నే నా?

"అవటాన్కి ఆధునికులే గాని మహా బుద్ధిమంతులండీ మా చిట్టింరాజులు—వారు పెద్దల చెవిని వేశాకే కార్డు వేస్తారు."

"ఊరకే అంటున్నారు గాని, మా బాబాయ్యగారు తమరి మాట కొట్టేస్తారుటండీ, తాతయ్యగారూ?"

తన సెన్యాధిపతి శత్రువుల పక్షమని అప్పుడే గ్రహించిన రాజులా నిస్సహాయంగా చిట్టింరాజుల వేపు చూశాడు గున్నారావు.

"పిల్లని చూసుకోటానికి తమరి కెలాంటి అభ్యంతరమూ లేనట్టుంది."

"తమరికి మాత్రం ఉంటుందా, తాతగారూ! మంచీ చెడ్డా ఎరిగిన వారూ—"

గుర్రుగా చూస్తూ గున్నారావు—

"పెద్దలమీద తమ కింత గౌరవ ముంటుందని అనుకోవడమే గాని, ఏ నాడు గమనించ లేకపోయానోయి, చిట్టింరాజులుగారూ."

"అవునండవునండి! మహా వదునైన బుద్ధి వారిది..." వెంకటేశ్వర్లు అయోమయంగా అన్నాడు. "తమ అభిప్రాయం నా కర్థమవటం లేదండి."

"వారికి అర్థమవుతుంది లెండి..." విసురుగా అన్నాడు గున్నారావు.

వెంకటేశ్వర్లు పొల్చేశాడు- "అంతేలెండి! వారికి అర్థమయితే చాలు గదా! అయినా, మా అల్లుడుంగారు ఈ కాలపు పిల్లల్లా కాదండీ- కన్నతండ్రి చూ స్తే చాలునూ అన్నాడు—అదండి పెద్దల వట్ల మర్యాదా అంటే-"

కార్యాన్ని బెడి °స కొట్టిస్తూన్న గున్నారావు మీద మహా క °సితో అన్నాడు చిట్టింరాజులు—"అలాగుటండీ, వంతులుగారూ! అడిగి చూడండి. నాయనా, సూర్యం! పిల్లని చూస్తావా అనీ! ఏం సెలవిస్తాడో?"

చిట్టింరాజులుని కావలించేసుకోవాలనిపిస్తోంది సూర్యానికి. ఆశగా మహుగారి వేపు చూశాడు.

గున్నారావుకి మనవడి చూపులు నచ్చటం లేదు. గుట్టుగా ఉంటూ, పెదవి విప్పకుండానే కావలి °సింది కాళ్ళ దగ్గరికి రప్పించుకోవాలనే నియోగం!

వెంకటేశ్వర్లు అందర్నీ కలియజూశాడు. గంభీరంగా నవ్వాడు.

"బాబూ! రాజుగారూ! మెతుకు ముట్టుకుంటే చాలు. అన్నం ఎలా ఉంటుందో తెలుస్తుంది! మొత్తం పట్టి చూడాలా? నాకుకూడా నాయనా, ఓ మాఱు పిల్లని చూసుకుంటావా అనే అడగాలనుంది. ఆ పిల్లాడి మొహం చూశాక, ఆ మర్యాదా, ఆ వినయమూ ఆకళింపయాక ఆ మాట అనే సాహసం లేకుండా పోయింది."

సూర్యానికి అందరిమీదా పడి తోడేల్లా పీక కొరికేయాలా అనిపిస్తూంది.

"తమరేం సెలవిస్తారు, మహుగారూ?"

ఇరుకున వడ్డ గున్నారావు సూర్యం చూపుల నించి తప్పించుకుంటూ "మా చిట్టింరాజులు మాత్రం చిన్నవాడుటండీ! నా మాటలు తమ కలా ఎలా బోధ పడ్డాయో గాని, పిల్లలంటే తలో రకంగానూ ఉంటారు. తప్పు బడితే ఎలా?"

అల్లుడిమీద నమ్మకంలో ఉన్న వెంకటేశ్వర్లుకి గున్నారావు మాటల్లో ధ్వని అందలేదు.

"అంతే లెండి! నే రాజుగారికి కవు రందించాలి" అని నిశ్చయించాడు.

కుర్రాళ్ళిద్దర్లో ఎవరి వేపు చూ °సినా పీక పి °సకేస్తారని అనుమానం వచ్చినట్టుంది. గున్నారావు ఆ గదిలోంచి బయటపడి రైతులతో పిచ్చాపాటీలో పడ్డాడు.

## 8

రాత్రి ఎనిమిదింటికే ఊరు మాటు మణిగింది.

వెంకటేశ్వర్లు ఆ రాత్రికి పట్టు బట్టి ఉంచేశాడు. ఇక తను పెక్కుకి పోతే సూర్యం చెయ్యి దాటిపోతాడని గున్నారావు అంగీకరించాడు. పిల్లను చూసుకునే ఉద్దేశంలో చిట్టింరాజులు లేడని సన్యా °సిరాజుకి కబురు వెళ్ళింది.

రాత్రి భోజనాల దగ్గరకూడా సూర్యం కోరిక తీరలేదు.

చిట్టింరాజులు, సూర్యం ఒకటై పోయారు. ఒకటే గుసగుసలు! సూర్యానికి ధైర్యం చిక్కటం లేదు! చిట్టింరాజులు రకరకాలుగా చెపుతున్నాడు!

"ఆమాత్రం పెళ్ళాం కోసంకూడా గోడ దూకాపోతే నువ్వేం మగాడివయ్యా, వంతులుగారూ."


సూర్యానికి అభిమానం పొడుచు కొచ్చింది.

లేచాడు- మంచంమీంచి తాత గుర్రు. చిట్టింరాజులులో కదలిక లేదు.

దుప్పటి ముసుగులా వేసుకుని బయటకు వచ్చాడు. అరుగుమీద బావమరుదులు నలుగురూ చాపలు పరుచుకు పడుకున్నారు. పగటి పూట మహుగారు ఇల్లు చూపించారు. అంతా గుర్తుంచుకున్నాడు.

చుట్టూ తిరిగి దొడ్డి గుమ్మం దగ్గరకు వచ్చాడు. నెట్టాడు. రాలేదు. గొళ్ళెం తప్పించటానికి సందు లేదు. గుమ్మం ముందున్న వేపచెట్టు ఎక్కాడు. కొమ్మలు ఇంట్లోకి వేలాడుతున్నాయి. చప్పుడు కాకుండా దిగాడు. చూపు చీకటికి అలవాటయింది! చుట్టూ చూశాడు.

విశాలమైన దొడ్డి! ఈశాన్యంగా నుయ్యి, చపటా,



స్నానాలగదీ ఉన్నాయి. అవి ఇంటికి దూరంగా ఉన్నాయి. అక్కడనుంచి వసారా మీద మనుములు అంత స్పష్టంగా కనపడరు. వసారా దగ్గరగా గాది! దాగోటానికి అనుకూలంగా ఉంటుంది. సూర్యం పిల్లిలా నడిచాడు! వసారా మీద మూడు మంచాలు! అంతా పూర్తి ముసుగుల్లో ఉన్నారు.

బుడ్డి లాంతరు వెలుగు తక్కువగా ఉంది. అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళి లాంతరు వత్తి హెచ్చించాడు. ఓ మంచం దగ్గర పాన్ దాన్! మామగారి మంచం గుర్తయింది. తల్లీ కూతురే, మామ్మా మనవరాలో కలి ి సి పడుకునుండాలి!

ఓ అంగలో గాదివార చేరాడు. వసారా బాగా కనిపించేటట్లు నక్కాడు- గాదికి చేరిచిన ఓ పిడక పెరికాడు. వి ి సిరాడు. ఏ మంచంమీదా పడలేదు. మరోటీ వి ి సిరాడు. పడింది. అందుమీద ఆకారం పక్కకి తిరిగి పడుకుంది.

సూర్యం చేతికి ఓ వానం కర్ర తగిలింది.

అందరూ లేస్తారు. ఆ పిల్లను చూడొచ్చు- తిరిగీ అందరూ పడుకున్నాక వెళ్ళి పోవచ్చు- అదీ అతని ఆలోచన.

నెమ్మదిగా చాచి మంచంమీద మనిషిని పొడిచాడు.

"ఛిచ్చీ! దిక్కుమాలిన కుక్క! రాత్రిళ్ళు మంచాలను పీకుతుంది. బయట పడే ి సి తలుపెయ్యవే అన్నాను. వెయ్యలేదూ! " అత్తగారి గొంతు ఆనవాలయింది.

ఒక్క మారుగా వేయి వీణానాదాలు.

మామ్మ పక్కలోంచి నిద్దర మత్తుగా అంది




రాజేశ్వరి- "లోపలే ఉంచేశానమ్మా! కొత్తాళ్ళను చూస్తే మీద పడిపోతుంది గదా!"

సూర్యం ఆ గొంతులో మాధుర్యాన్ని ఆస్వాదించలేకపోయాడు.

కుక్క! కుక్క! కుక్క!

సూర్యానికి చెమట పట్టింది.

ధైర్యం తెచ్చుకుని పెరడంతా చూడగలిగిన మేరకు చూశాడు. ఎక్కడా లేదు! రెండో వేపు చూట్టానికి శరీరాన్ని కదిలించి వంగి మోచేతిని నేలమీద ఆన్చాడు!

మెత్తగా తగిలింది!

తగలటమే కాదు, భూ నభోంతరాళాలు చిల్లు పడేలా భౌ-భౌ-భౌ-భౌ!

'దొంగ! దొంగ!" అరుపుల్తో వెంకటేశ్వర్లు!

సూర్యం పరుగులు! కుక్క పరుగులు! కర్ర పట్టుకుని వెంకటేశ్వర్లు పరుగులు!

వీధిలోంచి బావమరుదులు! గున్నారావుగారు.

ముసుగు జారిపోయిన సూర్యాన్ని ముందుగా రాజేశ్వరే గుర్తు పట్టింది! ఆయనే!

"రాణీ! రాణీ! " కుక్కను పిలిచింది.

మంత్రించినట్టు ఆగిం దది.

అల్లుణ్ణి గుర్తు పట్టిన వెంకటేశ్వర్లూ ఆగిపోయాడు!

బావమరుదులూ ఆగిపోయారు.

పమిటకొంగుతో నోరు మూసుకుంటూ అత్తగారూ ఆగిపోయింది!

"నాతో చెప్పలేక పోయావురా, మనవడా, అమ్మాయిని చూపించమని- నేనే అడిగేవాడిని! అవున్లే- ఇలాంటి పని చే ి సినందుకే నీ బాబుతో ఈ నాటికీ..." అంటూ గున్నారావు నాలుక కరుచుకొని ఆగిపోయాడు.

"ఏం జరిగిందర్రా?" ఏమీ కనిపించని ముసలమ్మ గొంతు!

సూర్యానికి మాత్రం సమస్త ప్రపంచమూ రాజేశ్వరి నవ్వుల వెనకాల పరుగులు తీస్తున్నట్టుంది! అంతా కదుల్తున్నట్టే ఉంది.

భయంలోంచి నిర్భయంలోకి
చీకటి అడవిలోంచి వెన్నెల నగరంలోకి
తేలుకుంటూ తూలుకుంటూ పరుగులు తీస్తూ
కావాల్సిన దేవత కనువిందు చేయగా-
లక్ష పున్నములు విరబూ ి సినట్లు రాజేశ్వరి-
ఇద్దరి హృదయాలూ, నయనాలూ ఏవో ప్రాచీన
వైదిక మంత్రాలు ఉచ్చ స్వరంతో వింటూ అంటూ-
"కన్యా నిరీక్షణ ముహూర్తః సుముహూర్తోస్తు!"

*


## జీవితం చాలా అపురూపమైనది జీవించండి దర్జాగా



బ్రిల్ క్రీమ్ హెయిర్ డ్రెసింగ్
మీ జీవనశైలికి వన్నె తెస్తుంది.




ఉచితం!

"హౌ టు లుక్ స్మార్ట్ అండ్ ఫీల్ కాన్ఫిడెంట్"
అన్న మా చిన్న పుస్తకం కోసం వ్రాయండి.
జాడీ మూత లోపలి కార్క్‌తో పాటు 70 పైసల స్టాంపు జతపరిచి, ఈ క్రింది చిరునామాకు పంపండి.

హెచ్.ఎమ్.ఎమ్. లిమిటెడ్, డిపార్ట్‌మెంట్
APW. 1 బైసింగ్ రోడ్, న్యూ ఢిల్లీ-110001

OBM/5829Tel